
అతి ప్రయాసతో సిటీబస్ దిగిన ప్రకాశం- 'ఏమైనా త్వరలో స్కూటరు కొనాలి' అని నిర్ణయించుకున్నాడు.

ఆఫీసునుంచి వస్తూ, బస్ దిగిన ప్రతిసారీ ఈ నిర్ణయం తీసుకో



వటం అతనికి పరిపాటి అయిపోయింది.

అంత మాత్రంచేత అతను స్కూటరు కొనలేక నిర్ణయాన్ని ప్రతిసారీ వాయిదా వేస్తున్నాడు అనుకోవటం పొరపాటు. ఆ మాట కొస్తే 24 గం॥లో స్కూటరు అతని చేతుల్లోకి తెచ్చుకోగల సామర్ధ్యం అతనికుంది.

ప్రకాశం చిన్నతనంనుండీ ఒక లెక్క ప్రకారం నడచిన వ్యక్తి. ఏ పనిచేసినా ముందు లాభాన్ని బేరీజు వేసుకొని ముందడుగు వేసే తత్వం అతనిది. ఒక్క ఆఫీసు పని కోసమే స్కూటర్ కొనటం, దాని మీద వేలకు వేలు పెట్టుబడి పెట్టటం-ప్రకాశానికి నచ్చని విషయం. అందుచేతే తన నిర్ణయాన్ని అమలు పరచకపోవటం.

ప్రకాశం ఆఫీసునుంచి వచ్చేసరికి ఇంటికి తాళం వేసి వుంది.

"అంకుల్! ఆంటీ మీకు ఇవ్వ

# కథా నిలయం

# మనస్తాపం

—న్యూట్రాన్



మంది" అంటూ ప్రక్కింటి పాప తాళం చెవి అందించింది ప్రకాశానికి.

ఇటువంటి సందర్భాలు అలవాటు కావటంతో విసుగుని అణుచుకొంటూ తాళం చెవిని అందుకున్నాడు ప్రకాశం.

'ఇంటికి వెళ్ళిన వెంటనే స్నానంచేసి, ఇంత తిని హాయిగా రెస్టు తీసుకోవాలి' అనుకున్న ప్రకాశం తలుపు తెరిచి టేబుల్ మీద భార్య మాలతి ఉంచిన ఉత్తరాన్ని చూసి నీరు కారిపోయాడు.

"అమ్మకు జ్వరం అని తమ్ముడు రాము వచ్చాడు-నన్ను తీసుకొని వెళ్ళటానికి మా ఇంటికి వెళతున్నాను. రేపు మీరు ఆఫీసు నుంచి వచ్చేసరికి నేనూ, బాబిగాడు తిరిగి వచ్చేస్తాము. ఈ పూటకి భోజనం ఏర్పాటుచేసి వుంచాను. రేపు ఉదయం ఎలాగూ మీరు ఆఫీస్ లోనే భోజనం చేస్తారు కదా..." ఇది ఆ ఉత్తరం సారాంశం.

ఉత్తరం చూస్తూ నీరసంతో పడక కుర్చీలో వాలాడు ప్రకాశం. 'ఇదేనా, తను ఆశించింది? మాలతిని చేసుకునే ముందు తను ఎంత ఆలోచించాడు? ఆ విశాఖపట్నం సంబంధం తనకు అన్ని విషయాలలో ఎంతో మెరుగనిపించింది. కాని తను ఎందుకు వదులుకున్నట్లు? తనకు కాబోయే భార్య పుట్టింటికి వెళ్ళిన ప్రతిసారీ ఎంత ఖర్చు అవుతుందో తనకు తెలియంది కాదు. ఉన్న వూళ్ళో పిల్లను చేసుకుంటే ప్రతి రెండు మూడు నెలలకు తన భార్య పుట్టింటికి వెళ్ళాలన్నా. తనకు ఖర్చు

వుండదు.

'పండగలకు పబ్బాలకు తను వెళ్ళాలన్నా తనకు ఎంతో కలిసి వస్తుంది. 'ఉన్న వూళ్ళోనే మామ గారు వుండటం-ముందు ముందు తనకు ఎన్నో విషయాలలో అండగా వుంటుంది' అనుకున్నాడు కాని ఇప్పుడు జరుగుతున్నదేమిటి?' ఎంతకూ తెగని ఆలోచనలతో సత మతమవుతున్నాడు ప్రకాశం.

సన్నగా తలనొప్పి మొదలవు తూంటే లేచి కాఫీకి డికాషన్ పెట్టాడు ప్రకాశం.

ఈ ఒక్క విషయంలోనైతే ప్రకాశం మాలతికి నచ్చచెప్పుకునే వాడే. కాని ప్రతి నెలా, కనీసం పది, పదిహేను రోజులు తన అత్త వారి కుటుంబం తన ఇంట్లో తిష్ట వేయటం భరించలేకుండా వున్నాడు. మామగారు మెడికల్ రిప్రజం టేటివ్. ఆయన నెలకు కనీసం 20 రోజులు ఉద్యోగరీత్యా టూర్‌లో వుండటం జరుగుతుంది. తన మామగారికి పెద్ద కూతురు మాలతి. రెండవ సంతానం బావమరది రాము. మూడవ సంతానం మరదలు సీత.

మామగారు అటు క్యాంపుకు వెళ్ళటమేమిటి, ఇటు అత్తవారి కుటుంబం ఏదో ఒక సాకుతో తన ఇంటిలో తిష్టవేయటం ఏమిటి-విధిగా జరుగుతోంది. చూస్తూ-చూస్తూ తను ఏమీ అనలేకుండా వున్నాడు. ఇటువంటివి తనకు సుత రాము ఇష్టం వుండవు. తను ఒక లెక్క ప్రకారం సంసారం నడపా లనుకునే మనిషి. కాని మాలతి ముఖం చూస్తూ తను ఏమీ అన లేకుండా వున్నాడు.

మాలతి అంటే తనకు ఎనలేని ప్రేమ.

మాలతి తన హృదయ రాజ్ఞి.

'కాని ఈ పరిస్థితినుంచి తను తప్పుకోవటం ఎలా?' అదే అతనికి విడదీయరాని సమస్య.

స్టౌవ్ మీద డికాషన్ పొంగ టంతో ఆలోచనల నుండి తేరు కున్నాడు ప్రకాశం. పాలు వేడి చేసి కాఫీ కలుపుకున్నాడు. వేడి వేడి కాఫీ త్రాగుతూ పేపరు చదు వుతూ అలసట తీరే వరకూ కూర్చున్నాడు.

స్నానం, భోజనం ముగిసింది కాని, ప్రకాశం మనసంతా పర ధ్యానంగా చికాకుగా వుంది. బోసి పోయిన ఆ ఇంటిలో నిలవ బుద్ధి కావటంలేదు. పదే పదే బాబిగాడు గుర్తుకు వస్తున్నాడు. వాడి బోసి నవ్వులు, తప్పటడుగులు, కేరింతలు ప్రకాశం సంతోషానికి పరాకాష్టలు.

కాని అవి ఏవి?

'పోనీ సినిమాకు వెళితే?' అనుకున్నాడు ప్రకాశం.

'కాని తనకు సినిమాలో మాత్రం వుల్లాసం వుంటుందని గ్యారంటీ ఏమిటి? మాలతి లేకుండా తను సినిమా చూసిన జ్ఞాపకంలేదు పెళ్ళయిన తరువాత. అంతకంటే ఆరు బయట మంచం వేసుకుని ఆకాశంలోని నక్షత్రాలను లెక్క-పెడుతూ పడుకోవటం తనకు ఎంతో ఇష్టం.'

పడుకున్న ప్రకాశానికి నిదుర రావటం లేదు.


# శ్రీ బాలాజీ వైద్యశాల

సెక్స్ స్పెషలిస్టు డా॥ పి. కుమారస్వామి దేవర

హెడ్డాఫీస్:—5/1, బ్రాడీపేట, గుంటూరు-2 (ఎ.పి.)

బ్రాంచీలు: మార్వాడి గుడివద్ద, తెనాలి (ఎ.పి.)

ఫోన్ : 551 26, నార్త్ బోగ్ రోడ్, మద్రాస్-17.

## దీర్ఘ వ్యాధులకు వుత్తమ వైద్యము



దురభ్యాసములకు లోనై దాంపత్య సుఖము పొందలేని వార్కి, (నిరుత్సాహముచే ప్రాణహాని చేసుకొనరాదు.) హెర్నియా, చర్మ వ్యాధులకు పోస్టు ద్వారా కూడా చేయబడును.

వరిబీజం (బుడ్డ), మూత్ర వ్యాధులకు ఇస్నోఫీలియా (దమ్ము), ఉబ్బసమునకు ఆపరేషన్ లేకుండా చేయబడును; స్వయంగా వచ్చి సంప్రదించవలెను.

NB: "శివలీల" తెలుగు పక్షపత్రిక అన్ని విషయములతో వెలువడుతుంది; చదవండి.

ఎడిటర్:- డా. పి. కుమారస్వామి దేవర, గుంటూరు (ఎ.పి.)

'రాము రాకపోతే మాలతి వెళ్ళేది కాదు. ఈ వంటరి పరిస్థితి తనకు కలిగేది కాదు. తన ఆనందాన్ని సగం హరించేది తన బావ మరిది రాము' అనుకున్నాడు ప్రకాశం.

మొన్నటికి మొన్న మాలతి పుట్టిన రోజు సందర్భంగా ప్రకాశం ఆఫీసుకు శలవు పెట్టి మాలతిని సినిమాకు బయలుదేర దీశాడు. తీరా బజారులోకి అడుగు పెట్టే సరికి, "అక్కా! పోయిన సారి నీవు విడిచి వచ్చిన బాబిగాడి బట్టలు అమ్మ ఇచ్చి రమ్మంది" అంటూ ఎదురు వచ్చాడు రాము.

"సరే! అవి ఇంటిలో వుంచిరా. ఉదయం నుంచి కనుపించలేదే? తర్వగా రా సినిమా చూద్దువుగాని" అంటూ ఆహ్వానించింది మాలతి.

ఈ పరిస్థితి నుంచి ఎలా బయట పడాలో తెలియని ప్రకాశం చూస్తూ నిలబడిపోయాడు.

సినిమా హాలులో ప్రకాశం మాలతిల మధ్య కూర్చున్నాడు రాము. ప్రకాశం ఆనందాన్ని పొంగే పాల మీద నీళ్ళు చిలకరించినట్లు అణచి వేశాడు. ఆ క్షణంలో మాలతికి ఏమనిపించిందో కాని ప్రకాశం మాత్రం ఇంకెప్పుడూ సినిమా చూడకూడదని నిర్ణయించుకున్నాడు.

ఆలోచనా పరంపరలో కలత నిదురపోయిన ప్రకాశం ఉదయం లేచేసరికి ఏడు దాటింది. త్వర త్వరగా కాలకృత్యాలు ముగించి ఆఫీసుకు బయలుదేరాడు ప్రకాశం.

ప్రకాశం తన సీటులో కూర్చున్నాడన్న మాటే కాని, పని చేయ బుద్ధి కావటం లేదు. తనకు వచ్చిన యీ సమస్యను ఎలా పరిష్కరించుకోవాలో అంతుపట్టకుంది. ఆఫీసులో తన సన్నిహిత మిత్రుడు చలపతికి యీ సమస్యను వివరించి, ఏదైనా సలహా ఇవ్వమని కోరాడు.

"నువ్వు మరీ మొహమాట పడుతున్నావు ప్రకాశం! ఎంత అయినవాళ్ళు అయినా కొన్ని కొన్ని విషయాల్లో నిష్కర్షగా వుండాలి. నీకు నచ్చని పనులు కాదు కూడదని చెప్పేయి" అన్నాడు చలపతి.

'అలా మొదటి నుంచీ వుండ గలిగితే యింత దూరం వచ్చేది కాదు' అనుకున్నాడు మనసులో ప్రకాశం.

మౌనంగా వున్న ప్రకాశాన్ని చూసిన చలపతి తన సలహా నచ్చ లేదని గ్రహించాడు.

"అలా చేయలేకుంటే మరో వూరికి ట్రాన్స్‌ఫర్ చేయించుకొని వెళ్ళిపో! అదే దీనికి సరైన

పరిష్కార మార్గం" అంటూ మరో మార్గాన్ని సూచించాడు చలపతి.

ప్రకాశానికి రెండూ సమ్మతం కాలేదు. అసలు అతనికి హైదరాబాదు విడిచి వెళ్ళటం ఎంత మాత్రం ఇష్టం లేదు.

ఆఫీసు నుంచి ఇంటికి వచ్చిన ప్రకాశానికి గుమ్మం ముందు ఆడుకుంటున్న బాబిగాడ్ని చూడగానే అవ్యక్తమైన ఆనందం కలిగింది. దగ్గరగా వచ్చిన ప్రకాశాన్ని చూడగానే బాబిగాడు చేతులు చాచాడు-తనను ఎత్తుకోమన్నట్లుగా. ఎత్తుకోవాలని ముందుకు వంగిన ప్రకాశానికి తన సమస్యకు పరిష్కార మార్గం మనసులో తళుక్కున మెరిసినట్లయింది.

మరుసటి రోజు సాయంత్రం యింటికి వస్తూనే ప్రకాశం తన పథకాన్ని అమలు పరిచాడు.

బాబిగాడికి అన్నం తినిపించుతున్న మాలతి, "ఏమండీ! బాబిగాడి చేతి ఉంగరం కనిపించటం లేదు'' అంటూ కంగారు పడసాగింది.

"ఏమైనట్లు? ఉదయం నేను ఆఫీసుకు వెళ్ళేటప్పుడు కూడా వాడి చేతిని చూశాను. ఉదయం నుంచి ఎవరు వచ్చారు మనింటికి? గుర్తు తెచ్చుకో!" అన్నాడు ప్రకాశం కంగారుగా.

"ఉదయం నుంచి బయటివాళ్ళు ఎవరూ రాలేదండి! మధ్యాహ్నం రాము వచ్చేంతవరకు నేనూ, బాబిగాడు నిదురపోయాము. తరువాత నేను పనిలో మునిగిపోయాను. రాము, బాబిగాడు ఆడుకున్నారు. మీరు వచ్చేముందే రాము వెళ్ళిపోయాడు" అంది మాలతి.

"అయితే ఎలా పోయినట్లు?"

"ఏమోనండి! అదే అంతుపట్టకుంది" అంది మాలతి దిగాలు పడుతూ.

"ఇల్లంతా వెతుకు-బాబిగాడు ఆడినప్పుడు ఏమన్నా జారిపడిందేమో!"

ఇల్లంతా వెతుకుతున్న మాలతికి సహాయం చేయసాగాడు ప్రకాశం.

* * *

ఆఫీసునుంచి వస్తూనే దిగులుతో నీర్సంగా బాబిగాడ్ని వళ్ళో కూర్చోపెట్టుకొని ఆలోచిస్తున్న మాలతితో, "మాలతీ! ఈ రోజు వస్తూ ప్రముఖ జ్యోతిష్కుడు 'శివరాం' గారు హోటల్ 'జయ'లో దిగారని తెలిసి కలిసి వచ్చాను. మన వుంగరం కాజేసినవారి పేరులో మొదటి అక్షరం 'ఆర్' వస్తుందని చెప్పారు" అన్నాడు ప్రకాశం.

"ఎవ రున్నారండీ ఆ పేరు గలవాళ్ళు- మన ప్రక్క పోర్షన్ రామనాధంగారు, తమ్ముడు రాము తప్ప?" అంది మాలతి.

"రామనాధంగారు రెండు రోజుల నుంచి క్యాంపులో వున్నా రాయె...."

"ఏమండీ! మిగిలింది మన రాము. రాము తీశాడంటారా?" సంశయంగా అడిగింది మాలతి.

"ఏమిటి మాలతీ, నీ పిచ్చిగాని! మన రాము చేస్తాడా యీ పని? నేను నమ్మను."

"ఏమో! ఏ పుర్రెలో ఏ బుద్ధి ఎప్పుడు పుడుతుందో మనం చెప్ప లేమండి! అయినా రాముని అడగ టంలో తప్పు లేదుగా?" అంది మాలతి తన మనసును కుదుట పరుచుకుంటూ.

"సరే! నీ యిష్టం. నీ యిష్ట ప్రకారమే కానీ" అన్నాడు ప్రకాశం తనకుయిష్టం లేదన్నట్లుగా.

మాలతి మరుసటి రోజు వుదయమే రాముని నిలదీసి అడిగింది. నిర్లక్ష్యంగా 'నేను తీయలేదు, నాకు తెలియదు' అన్న రాము సమాధానాలు మాలతి అహం మీద దెబ్బ కొట్టాయి.

అంతటితో ఆగక, "నువ్వే తీశావు. ఏమి చేశావో చెప్పు!" అంటూ గద్దించసాగింది మాలతి.

"మాలతీ! ఏమిటా మాటలు? మరీ మితిమీరి పోతున్నావు. ఏదో అక్కయిల్లు కదా అని ఒకటికి నాలుగు సార్లు వచ్చినంత మాత్రాన స్వంత తమ్ముడినే అనుమానించే స్థితికి వచ్చావంటే నిన్ను ఏమను కోవాలి? ఈ రోజు వాడిని అంటు న్నావు, రేపు మమ్మల్ని అన టానికైనా వెనుదీయవు. చాలించు యింతటితో" అంది కోపంగా అమ్మ రుక్మిణమ్మగారు.

"చాలించక నేను చేయగలి గిందేముంది? నా వాళ్ళు, నా వాళ్ళు అని యింతవరకు నెత్తికెక్కించు కున్నాను. ఇప్పుడు అడిగినంత మాత్రానికే మీకు పరాయిదానినయి పోయాను. మిమ్మల నని లాభ మేముంది? ఎంత కన్నవారిల్లయినా పిలవకుండా పాటికి పదిసార్లు రావటం నాదే తప్పు" అంటూ రుసరుస లాడుతూ తిరుగు ముఖం పట్టింది మాలతి.

ఆ రోజుతో రెండిళ్ళ మధ్య రాకపోకలు తగ్గి పోవటంతో, ప్రకాశం మనసు ఆనందంతో నిండి పోయింది. ఉంగరం ప్రకాశం తీశాడని తెలిసీ చెప్పలేని బాబిగాడు మాత్రం తన బోసి నోటితో నవ్వుల్ని విరజిమ్ముతున్నాడు. *